క్లుప్తంగా

యువరాజ్‌రెడ్డి వితరణతో బోరు పంపు ఏర్పాటు



మైలవరం: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఆయన మేనల్లుడు బొల్లారెడ్డి యువరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో మైలవరం మండలం గణపవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోరు పంపును మంగళవారం వేయించి మోటార్ అమర్చారు. ఉపాధ్యాయులకు కుర్చీలు అందజేశారు. యువరాజ్‌రెడ్డిని గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించాలి

ఆర్టీసీ జోనల్ ఈడీ విజయరత్నం

తిరువూరు: ఆర్టీసీ కార్మికులు సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించాలని విజయవాడ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం పేర్కొన్నారు. తిరువూరు ఆర్టీసీ డిపోలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన డిపో మేనేజరు కార్యాలయం, విచారణ కేంద్రం, మహిళా కండక్టర్ల విశ్రాంతి గది, భోజనశాల, సెక్యూరిటీ, గ్యారేజ్ సెక్షన్ గదులను ప్రారంభించిన ఈడీ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం నిర్ణయించినందున బస్సుల కండీషన్ మెరుగుపరచాలని, మార్గమధ్యంలో బస్సులు ఆగకుండా కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. విజయవాడ డివిజినల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎంవై దానం, ఇంజినీరింగ్ అధికారులు, డిపో అధికారులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల నాయకులు తిరువూరు డిపోలో నెలకొన్న పలు సమస్యలు, బస్సుల కండీషన్‌ను ఈడీకి వివరించారు.

దుకాణాల తనిఖీ

నూజివీడు: నిషేధిత గుట్కా, సిగరెట్లు విక్రయించినా, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పాన్‌షాపులు, సిగరెట్ల షాపులపై డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ పి. సత్యశ్రీనివాస్ తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కాలు, సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలు ఎక్కడైనా జరుగుతుంటే సమాచారాన్ని పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకునికి అభినందన

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ జె. రాముడుకు భారత ప్రభుత్వం ద్వారా మూడు పేటెంట్‌లు ప్రచురితం అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మంగళవారం తెలిపారు. డాక్టర్ రాముడును కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు, బి. సుభాషిణి, డాక్టర్ మెండ దేవానంద్‌కుమార్, హరిబాబు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

ముసునూరు: మండలంలోని సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన మండల సమస్యలపై విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్‌లు కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తిరువూరు: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని తిరువూరు సీఐ గిరిబాబు అన్నారు. మంగళవారం తిరువూరులోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో గంజాయి, మత్తుపదార్థాలు, ఖైనీ, సిగరెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని ఒక దుకాణంలో నిషేధిత సిగరెట్లు, గుట్కా అమ్ముతున్నట్లు గుర్తించి దుకాణదారుకు జరిమానా విధించారు. ఎస్‌ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని..

పోలీసుల అదుపులో సీనియర్ జర్నలిస్టు

సాక్షి నెట్‌వర్క్: ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం పరిధిలోని పలు అంశాలపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడనే నెపంతో కొండపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, టీడీపీ సానుభూతిపరుడు వెలమా రామారావును మైలవరం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం తీరు, అభివృద్ధికి నోచుకోని రోడ్లు, నియోజకవర్గంలో జరుగుతున్న మట్టి మాఫియా వ్యవహారాలపై ఇటీవలి కాలంలో సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లో ఆయన పెట్టిన పోస్టులు స్థానిక ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగా మారినట్లు చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ కూటమి నేత ప్రోత్సాహంతో జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందిన సుఖవాసి శ్రీహరి, చిననందిగామ సర్పంచి ధనేకుల శ్రీకాంత్, మరో వ్యక్తి ద్వారా మైలవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. ఆ మేరకు కొండపల్లి నుంచి మైలవరం పోలీస్ స్టేషన్‌కు రామారావును తరలించారు. జర్నలిస్ట్ సంఘాలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి.



తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నివాళి



జి.కొండూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



నూజివీడు ఏరియా ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



కేక్ కట్ చేస్తున్న విస్సన్నపేట ఎంపీపీ తదితరులు



మాధవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షేమ సారథి వైఎస్సార్

- నియోజకవర్గాల్లో ఘనంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు
- విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులు
- రాష్ట్రానికి వైఎస్సార్ చేసిన సేవలను స్మరించుకున్న నేతలు

తిరువూరు/మైలవరం/నూజివీడు: దేశంలోనే తొలి సారిగా అన్ని వర్గాలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప దార్శనికుడిగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పలువురు వక్తలు అన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

● విస్సన్నపేట: స్థానిక ఎ. కొండూరు రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి వెంకట శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ భూక్యా రాణి, నాయకులు సిరసాని ప్రకాష్, పల్లెపాం లక్ష్మయ్య, ముంగా జయరాజు, కోటా శ్రీను తదితరులు పాల్గొన్నారు. పుట్రేల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కారుమంచి స్వాతి, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్సార్..

జి.కొండూరు: ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో పథకాలతో పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో జి.కొండూరులో వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తిరువూరు మండలంలో..

తిరువూరురూరల్: మల్లేలలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్, సర్పంచి వంగూరి మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు దార్ల ఏసుపాదం, వరికుటి రవికుమార్, చంద్రశేఖర్, రోలుపడిలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరత్నం, రాజుగూడెంలో ఎంపీటీసీ సభ్యురాలు కంచిపోగు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కిశోర్, గోపాలకృష్ణ, వామకుంట్లలో వైఎస్సార్ సీపీ నాయకులు బండి రామ్మోహన్‌రావు, తీగెల బాబు, హనుమంతరావు తదితరులు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దవరంలో సర్పంచి అప్పారావు, ఎంపీటీసీ రాధాకృష్ణ, పార్టీ నాయకులు నరసింహారావు, రాములు, రామకృష్ణ, వావిలాలలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కోలా శ్రీను, స్థానిక నాయకులు వెంకటేశ్వరరావు, రాజవరపు కృష్ణయ్య, అర్జునరావు, ఎర్రమాడులో సర్పంచి బొర్రా మాధవి, వైఎస్సార్ సీపీ నాయకులు మోహనరావు తదితరులు వైఎస్సార్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మునుకుళ్ల, కోకిలంపాడు, అక్కపాలెం, ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, చింతలపాడు, గానుగపాడు, చౌటపల్లి, జీకొత్తూరు, చిట్టేల, ఆంజనేయపురం, లక్ష్మీపురం, కాకర్ల, ఎరుకోపాడు తదితర గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు.

● విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి గ్రామ పార్టీ కన్వీనర్ కర్నాటి రాంబాబు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, మండల పార్టీ అధ్యక్షుడు బయ్యారపు రవికిశోర్, పరికెల శ్రీనివాసరావు, మెండెం సుబ్బారావు పాల్గొన్నారు. జక్కంపూడిలో గ్రామ కన్వీనర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తగరం సాంబయ్య, నందిపాము ప్రభాకరరావు, గర్నేపూడి కొండలరావు, మైలవరపు మధుసూదనరావు పాల్గొన్నారు. షాబాదులో గ్రామ కన్వీనర్ గుంజి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, పైడూరుపాడులో సర్పంచి వేముల సీతారామయ్య ఆధ్వర్యంలో, రాయనపాడులో గ్రామ పార్టీ కన్వీనర్ పోలసాని వాసు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. పార్టీ, వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్సార్..

మైలవరం: మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పథకాల ప్రదాత అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎల్‌హెచ్ కాంప్లెక్స్ వద్ద, మూడు విగ్రహాల సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, మాడపాటి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు



ముసునూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు సోమరాజుల శివశంకర్, నాయకులు మరీదు కృష్ణ, బీడీ రవికుమార్, పరిమి సాగర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా వైఎస్సార్ జయంతి..

చాట్రాయి: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. చాట్రాయి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దేశిరెడ్డి రాఘవరెడ్డి కేక్ కట్‌చేసి వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, కారంగుల వాసు, పరసా చెన్నారావు, రాజేష్, సంకు సత్యనారాయణ, బండి శ్రీనివాసరెడ్డి, మద్ది రామయ్య తదితరులు పాల్గొన్నారు. పోలవరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు చెలికాని బాల్జీ, చనుబండలో దిరిశాల సత్యనారాయణ, సిగుడిపాడులో మందపాటి రఘుపతిరెడ్డి, విస్సంపల్లి సీతయ్య, కృష్ణారావుపాలెంలో గుడ్ల శ్రీనివాసరావు, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, కొత్తగూడెంలో చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు తదితరులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

పేద ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేద ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం స్థానిక మైలురాయి సెంటర్‌లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదేశాల మేరకు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరువూరులో నాయకుల నివాళి

మహానేతకు ఘన నివాళి..

తిరువూరు: గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎ.కొండూరు మండలంలోని మాధవరం, కంభంపాడు, ఎ.కొండూరు, అట్లప్రగడ, రేపూడి, వల్లంపట్ల, పోలిశెట్టిపాడు, గోపాలపురం, కోడూరు, రామచంద్రాపురం, చీమలపాడు, కృష్ణారావుపాలెం, గొల్లమందల గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, ఎ.కొండూరు మండల పరిషత్ అధ్యక్షురాలు కాలసాని నాగలక్ష్మి, ఉపాధ్యక్షుడు గుంటక శివారెడ్డి, జెడ్పీటీసీ భూక్యా గన్యా, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రామలక్ష్మారెడ్డి, ఎంపీటీసీ కోట పుల్లారావు, కోడూరు సర్పంచి టి. సురేష్, కేశ్యా తండా సర్పంచి పెదబాబు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● విస్సన్నపేట: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి నివాసం వద్ద ఎంపీపీ కేక్ కట్ చేసి మహానేతకు నివాళులర్పించారు. పార్టీ నాయకులు సిరసాని ప్రకాష్,పిల్లి రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

● తిరువూరు: గంపలగూడెం, తోటమూల, గోసవీడు, దుందిరాలపాడు, తునికిపాడు, ఊటుకూరు, కొణిజర్ల, పెనుగొలను, కనుమూరు, అనుముల్లంక, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్, జెడ్పీటీసీ కోట శామ్యూల్, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, పార్టీ నాయకులు చెన్నకేశవరెడ్డి, కోట దాసు, ఏకే రెడ్డి, బొల్లా కరుణాకరరావు, ఆంజనేయులు, ఆలపాటి ఉమా, నాగమల్లేశ్వరరావు, గౌరసాని శ్రీనివాసరెడ్డి, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, చెరుకు నరసారెడ్డి, చావా వెంకటేశ్వరరావు తదితరులు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. చిత్రపటాలకు నివాళులర్పించారు.

వాడవాడలా నివాళి..

ముసునూరు: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యాప్తంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ వైఎస్సార్ సేవలను కొనియాడారు. ముసునూరులో మాజీ సర్పంచ్‌లు ఆర్.గోపాలకృష్ణ, టి.సుబ్బారావు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, యూత్ అధ్యక్ష, కార్యదర్శులు గూంట్రు రంగారావు, మానికల గంగాధర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాట్రేనిపాడులో రాష్ట్ర నేతలు కంబాల రాంబాబు, పి.స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. గుళ్లపూడి, చింతలవల్లి, రమణక్కపేట, బలివే, కొర్లగుంట, వలసపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీల అధ్యక్షులు, సొసైటీల మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో యూత్ సభ్యులు కేకులు కట్ చేసి పంచిపెట్టారు.

● మైలవరం: వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రెడ్డిగూడెంలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. మండలంలోని ప్రతి గ్రామంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కె.తాడేపల్లి గ్రామంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



తిరువూరు మండలం వావిలాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మైలవరంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



చాట్రాయి సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న దేశిరెడ్డి



గొల్లపూడిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం

తిరువూరు:తిరువూరులోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం, జైబావి సెంటర్, కోకిలంపాడు రోడ్డు, బోయకాలనీ, పీటీకొత్తూరు, రాజుపేట చెక్‌పోస్ట్ సెంటర్లలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ రాష్ట్రంలో నిర్వహించిన పాదయాత్రలో ప్రజా సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 104, 108 వైద్యసేవలు, వ్యవసాయరంగానికి, ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం, రైతు రుణమాఫీ వంటి చారిత్రాత్మక పథకాలు రాష్ట్ర ప్రజల స్థితిగతులను మార్చేశాయన్నారు. ఆయన చూపిన బాటలో నడవాలని స్వామిదాసు సూచించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. సుధారాణి, పార్టీ నాయకులు రేగళ్ల మోహన్‌రెడ్డి, వెలుగోటి ఆదినారాయణ, షేక్ జాకీర్, యరదేశి రామారావు, కలకొండ రవికుమార్, కాలసాని గోపాల నాగేశ్వరరావు, పరసా నెహ్రూ, టి. వేణు, అంజన్‌రెడ్డి, కుంచం విజయలక్ష్మి, గుంటూరు మస్తాన్, గజ్జల సీతారామయ్య, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్

ఇబ్రహీంపట్నం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజల గుండె చప్పుడుగా నిలిచారని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్, కిలేశపురం గ్రామంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. జోగి రమేష్ పాల్గొని వైఎస్సార్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ తన పాదయాత్రతో ఆంధ్ర రాష్ట్ర ముఖచిత్రం మార్చిన గొప్ప నేత వైఎస్సార్ అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టి కార్పొరేట్ వైద్యశాలల్లో కొన్ని లక్షల మంది ప్రాణాలు కాపాడిన వైఎస్సార్‌ను మనం గుర్తుంచుకోవాలని చెప్పారు. మహానేత తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలు ప్రతి ఇంటికి చేర్చారని చెప్పారు. నేడు సుపరిపాలన పేరుతో ఇంటింటికీ తిరుగుతున్న కూటమి నాయకులను సూపర్ సిక్స్ ఎక్కడ అని ప్రశ్నించారు. ఈ సమయంలో ముఖ్యమంత్రిగా జగనన్న ఉండి ఉంటే ఆసరా, చేదోడు, చేయూత, రైతుభరోసా, ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు అందేవని ప్రజలు భావిస్తున్నారని స్పష్టం చేశారు. కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో వైస్సార్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఇబ్రహీంపట్నం శక్తినగర్, కొండపల్లి బీకాలనీతో పాటు వివిధ గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, వివిధ విభాగాలకు చెందిన నాయకులు మేడపాటి నాగిరెడ్డి, మిక్కిలి శరభయ్య, వాహెద్, పచ్చిగోళ్ల పండు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

నూజివీడు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ప్రజారంజకపాలన అందించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో వైఎస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన పలు పథకాలు ఎన్ని దశాబ్దాలు గడిచినా పేదలకు ఉపయోగపడుతూనే ఉంటాయన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేయడమే కాకుండా పట్టణ ప్రజలకు కృష్ణాజలాలను అందించిన గొప్ప నేత అని చెప్పారు. పట్టణంలో ఎమ్మార్ అప్పారావు కాలనీని ఏర్పాటు చేసి నాలుగు వేల మంది పేదలకు నివేశన స్థలాలతో పాటు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు ప్రతాప్ అప్పారావు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మునిసిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, నాయకులు మలిశెట్టి బాబీ, బసవా వినయ్, గాదెరెడ్డి రంజిత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాణావతు రాజు, పిళ్లా చరణ్, షేక్ మస్తాన్, షేక్ గబ్బర్, చేబత్తిన మున్నా, మందాడ శివశంకరరావు, పల్లె రవీంద్రరెడ్డి, బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మద్యానికి బానిసైన కుమారుడు తల్లిదండ్రులపై దాడి చేసిన ఘటన కొండపల్లి ఇందిరా నగర్‌లో మంగళవారం జరిగింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం..మద్దాల వెంకటేశ్వరరావు, శాంతి దంపతుల చిన్నకుమారుడు మద్దాల రవి మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. ఇప్పటికే పలుమార్లు వారిపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. కుమారుడి వేధింపులు తట్టుకోలేక ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కలుపు నివారణకు సూచనలు

విస్సన్నపేట: పొడి దుక్కిలో నేరుగా వరి విత్తనం చల్లుకునే పద్ధతిలో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య కలుపు అని, దాని నివారణకు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ కె. శశికళ అన్నారు. మంగళవారం ఏడీఏ మాట్లాడుతూ వరి విత్తిన 15 రోజులకు ఒక సారి, 30 రోజులకు ఒక సారి కలుపు తీయించాలన్నారు. తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.

● తిరువూరురూరల్: చింతలపాడు, ఎరుకోపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ పద్మ మాట్లాడుతూ వరిపైరులో నాట్లు వేసే ముందు కొనలు త్రుంచి నాటుకోవడం వలన కాండం తొలిచే పురుగు, గుడ్ల సముదాయాలను నశింపజేయవచ్చన్నారు. ఖరీఫ్ సాగులో సస్యరక్షణ చర్యలను సూచించారు. ఏఈఓ అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారుగా శ్రీనివాస్

తిరువూరు: తిరువూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రారుగా రగాని శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న బానోతు జగన్ స్థానంలో ఆయనను నియమించినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. జగన్ గతంలో మైలవరం సబ్ రిజిస్ట్రారుగా పనిచేసినప్పుడు విధినిర్వహణలో అలసత్వ వైఖరిపై శాఖాపరమైన విచారణ కారణంగా ఆయనను తిరువూరు కార్యాలయ బాధ్యతల నుంచి తప్పించినట్లు తెలిసింది.

ఎంఈఓ-1 రామ్మూర్తి బాధ్యతల స్వీకారం

ముసునూరు: మండల విద్యాశాఖాధికారి-1గా టి.రామ్మూర్తి బాధ్యతలు చేపట్టారు. టి.నర్సాపురం ఎంఈఓ-1గా పనిచేస్తున్న ఆయన ముసునూరు ఎంఈఓ-1గా మంగళవారం పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన రామ్మూర్తికి ఎంఈఓ-2 బీవీఎస్ సుబ్బారావు, యూటీఎఫ్ నాయకులు పద్మకిశోర్, రాంబాబు, నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

యంత్రాలతో సాగు మేలు

చాట్రాయి: , ఆధునిక యంత్రాలతో రైతులు వ్యవసాయం చేయాలని వ్యవసాయాధికారి బి. శివ శంకర్ అన్నారు. మంగళవారం చాట్రాయి రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం వల్ల సమయంతోపాటు ఖర్చు ఆదా అవుతుందని చెప్పారు.